తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
08-11-2024
శుక్రవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 63 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. జీవో నెంబర్ 36తో దీన్ని ఏర్పాటు చేసి, కిసాన్ కాంగ్రెస్ నేత కోదండ రెడ్డిని చైర్మన్‌గా నియమించింది. భూ చట్టాల నిపుణుడు సునీల్‌తో సహ మరో ఆరుగురు సభ్యులుగా ఈ కమిషన్ ముందుకెళ్తోంది. మొదటి సమావేశం బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో జరిగింది. అయితే, కమిషన్‌కు సంబంధించి అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. విద్యా కమిషన్‌కు వసతులు ఆగమేఘాలపై ఏర్పాటు కాగా, రైతు కమిషన్‌పై మాత్రం అశ్రద్ధ వహిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

# ముందుకు సాగని రైతు కమిషన్

జయభేరి, హైదరాబాద్:

బీఆర్‌కే భవన్‌లో కమిషన్ ఏర్పాటైంది కానీ, సరైన సౌకర్యాలు చేయలేదు సంబంధిత అధికారులు. కనీస వసతులు, కావాల్సిన సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్నారు సభ్యులు. చాంబర్లు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు ఉన్నతాధికారులు. ప్రస్తుతం చైర్మన్ కోదండ రెడ్డి కోసం ఒక చాంబర్ ఏర్పాటు చేయగా, అందులో వాష్ రూమ్‌కు డోర్ లేని పరిస్థితి. ఎవరైనా వాష్ రూమ్‌కు వెళ్లాలంటే మరొకరు దగ్గరలో నిలబడాల్సి వస్తోంది. వచ్చిన గెస్టులు దీన్ని చూసి షాక్ అవుతున్నారు. ఈ పరిస్థితి చూసి బాధ్యతలు తీసుకోడానికి సభ్యులు వెనుకాడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తోంది.బాధ్యతలు తీసుకున్న మెంబర్లు చాంబర్ల లేక చైర్మన్ రూమ్‌లోనే కూర్చుంటున్నారు. ఈ పరిస్థితి చూసి రాములు నాయక్ తనకు పదవి వద్దని అంటున్నట్టు సమాచారం. ఓవరాల్‌గా ఈ వ్యవహారం చూశాక, అధికారుల

...మిగతాది 2 లో

ట్రంప్ ప్రభుత్వ ఏర్పాటుకు

# సహకరిస్తాం

కమలా హారిస్



- జయభేరి, వాషింగ్టన్, నవంబర్ 7:

అమెరికా దేశాధ్యక్ష ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ విక్టరీ కొట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ప్రభుత్వ ఏర్పాటుకు, అధికార మార్పిడికి సహకరించనున్నట్లు కమలా హారిస్ తెలిపారు. డెమోక్రటిక్ అభ్యర్థిగా పోరాడి ఓడిన కమలా హారిస్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అమెరికా ఆశాజ్యోతి దివ్యంగా వెలుగుతుందని ఉపాధ్యక్షురాలు హారిస్ తెలిపారు. అధికార మార్పిడి శాంతియుతంగా జరిగేందుకు ట్రంప్‌నకు సహకరించనున్నట్లు ఆమె వెల్లడించారు. హోవర్డ్ యూనవర్సిటీలో ఆమె తన మద్దతుదారులతో భావోద్వేగంగా మాట్లాడారు. ఫలితాలను ఆమోదించాలని ఆమె అభిమానులను కోరారు. దేశ ఆదర్శాలను రక్షించేందుకు పోరాడాలన్నారు. తన మనసు సంతోషంతో నిండి ఉన్నదని, మీరు నాపై చూపిన నమ్మకానికి కృతజ్ఞతతో ఉన్నట్లు ఆమె తెలిపారు. విజయం సాధించిన ట్రంప్‌తో మాట్లాడానని, ఆయనకు కంగ్రాట్స్ చెప్పినట్లు ఆమె వెల్లడించారు. ట్రంప్‌కు, ఆయన టీమ్‌కు హెల్ప్ చేస్తానని చెప్పానని, శాంతియుతంగా అధికారాన్ని బదలాయిస్తామన్నారు.

# తెలంగాణ యువతేజం



- జయభేరి, హైదరాబాద్, నవంబర్ 7,:

భారత చెస్ గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఎరిగైసి గారు ప్రపంచ నంబర్ 2 ర్యాంకును కైవసం చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. తనకు అతి సమీపంలో ఉన్న మొదటి ర్యాంకును సైతం అర్జున్ గారు సాధించగలరని సీఎం గారు ఆశాభావం వ్యక్తం చేశారు. చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో 3వ రౌండు విజయంతో లైవ్ చెస్ రేటింగ్ లో 2805.8 పాయింట్లు సాధించిన అర్జున్ ఎరిగైసి వరల్డ్ నంబర్ 2 స్థానానికి ఎగబాకారు. 2831.0 పాయింట్లతో నార్వే దేశానికి చెందిన మాగ్నస్ కార్ల్‌సన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

# 5ఏళ్లలో ఎపి విద్యారంగాన్ని నెం.1గా తీర్చిదిద్దుతాం!



- నైతిక విలువలతో కూడిన విద్యాబోధన అవసరం
- జాబ్ క్రియేటర్స్ గా యువత తయారయ్యేలా ప్రోత్సహం
- నవీన ఆవిష్కరణలపై యువత దృష్టి సారించాలి
- ఇంటర్నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్ లో మంత్రి నారా లోకేష్

జయభేరి, అమరావతి:

రాబోయే అయిదేళ్లలో ఎపి విద్యారంగాన్ని దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమరావతిలోని విట్ యూనివర్సిటీ ప్రాంగణంలో విట్ - ఎపి ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఇంటర్నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్ (IHEF)ను మంత్రి లోకేష్ ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన అధునాతన డ్రైవర్ లెస్ వ్యాన్, డ్రోన్, రోబోట్

...మిగతాది 2 లో



# బెంగళూరుకు హైడ్రా...

జయభేరి, బెంగళూరు, నవంబర్ 7:

హైడ్రా అధికారులు చెరువుల పునరుద్ధరణ, విపత్తుల నిర్వహణపై అధ్యయనం చేసేందుకు నేడు బెంగుళూరుకు వెళ్లారు. రాష్ట్రంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు, చెరువుల సంరక్షణతో హైడ్రాకు ఎంతో గుర్తింపు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రతిపక్షాలు హైడ్రాపై అసత్య ప్రచారం చేసినప్పటికీ తన పని తాను చేసుకుంటూపోతున్న హైడ్రాకు ప్రజల మద్దతు లభిస్తోంది. చెరువులను సంరక్షించాలని, అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.ఇప్పటికే చెరువుల్లో నిర్మించిన పలు కట్టడాలను హైడ్రా కూల్చివేసిన సంగతి తెలిసిందే. కాగా తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నగరంలోని ఐదు చెరువలను పునరుద్ధరించాలని ఇటీవల హైడ్రాను ఆదేశించింది. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇతర అధికారులతో కలిసి బెంగుళూరులో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో అధికారులు

...మిగతాది 2 లో

# సోషల్ మీడియాలో పిచ్చిరాతలపై వార్నింగ్

జయభేరి, విజయవాడ, నవంబర్ 7:



షల్ మీడియాలో కొంత మంది అంబోతుల్లా తయారయి కుటుంబంలో మహిళలపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తున్నారని వారిని వదిలి పెట్టే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. మదం ఎక్కి, సోషల్ మీడియాలో ఆడ బిడ్డలపై ఇష్టం వచ్చినట్టు పోస్టింగులు పెడుతున్నారని మండిపడ్డారు. ఇంట్లో పిల్లల గురించి కూడా నీచంగా క్యారెక్టర్ అసాసినేషన్ చేస్తున్నారు. మదం ఎక్కువై, కొవ్వు ఎక్కువై, నేరస్తులుగా తయారయ్యి, రాజకీయం చేస్తున్నారు. ఇలాంటి వాళ్ళని వదిలేయాలా అని అడుగుతున్నానని అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రశ్నించారు. మదం ఎక్కువైపోయి.. కొవ్వెక్కిపోయి నేరస్తులుగా మారుతున్నారు. మనుషులని మర్చిపోయి పిల్లలపైనా అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. వదిలి పెట్టాలా వీళ్లని అని ప్రశ్నించారు. తన కుటుబంతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనితలపైనా జుగుప్సాకరమైన పోస్టింగులు పెడుతున్నారని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు చూసి ఆయన ఇంట్లో చిన్న పిల్లలు కన్నీరు పెట్టుకున్నారని చంద్రబాబు తెలిపారు. వైసీపీ వాళ్ల సొంత పత్రిక పెట్టి ప్రతి రోజు ఫేక్ కథనాలు రాస్తున్నారని విమర్శించారు. వైఎస్ వివేక హత్య జరిగిన రోజు.. సాక్షి పత్రికలో ఏ కథనం వచ్చిందో అందరికీ తెలుసునన్నారు. వైఎస్ వివేకాను గొడ్డలితో నరికి హత్య చేసి.. తనపై వాళ్ల పత్రికలో నారా సుర రక్త చరిత్ర అంటూ రాశారని

...మిగతాది 2 లో

# మల్లారెడ్డికి ఈసీ నోటీసులు



- జయభేరి, హైదరాబాద్, నవంబర్ 7,:

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఈడీ నోటీసులు ఇచ్చింది. పీజీ మెడికల్ సీట్లు అక్రమాలపై ఈ నోటీసులు ఇచ్చింది. గతేడాది మెడికల్ కాలేజీల్లో సోదాలు చేసింది. కీలక డాక్యుమెంట్లు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం చేసుకుంది.గతేడాది జూన్‌లో 10 ప్రైవేట్ మెడికల్ కాలేజీలపై ఈడీ దాడులు చేసింది. మెడికల్ సీట్లను బ్లాక్ చేసి అమ్ముకున్నట్లు గుర్తించింది. సోదాలకు సంబంధించి కీలక డాక్యుమెంట్లు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం చేసుకుంది. ఈ వ్యవహారంపై వివరణ కోరుతూ ప్రస్తుతం నోటీసులు ఇచ్చింది.సమయం, సందర్భం వచ్చినప్పుడు పాలు, పూలు అమ్మి పైకొచ్చానని చెబుతారు బీఆర్ఎస్ మాజీ మంత్రి మల్లారెడ్డి. ఐటీ, ఈడీ రైడ్స్ చేసినప్పుడు ఆయన చెప్పే మాట ఇది. గతేడాది జూన్‌లో మల్లారెడ్డి మెడికల్ కాలేజీలో రెండురోజుల

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## ముందుకు సాగని రైతు కమిషన్

నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుల కోసం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేస్తే, కిందిస్థాయిలో అధికారులు నీరుగార్చే ప్రయత్నంలో ఉన్నారు. దీనికి ప్రధాన కారణం, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌కు కమిషన్ ఏర్పాటు ఇష్టం లేదనే టాక్ వినిపిస్తోంది. అందుకే, కమిషన్ ఏర్పాటుపై జీవో ఇవ్వడానికి ఈయన మొదట్లో ఆలస్యం చేశారని అనుకుంటున్నారు.రాష్ట్రంలో రైతు సంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకుంటోంది ప్రజా ప్రభుత్వం. ఇప్పటికే రుణమాఫీ అందించి ఎన్నో కుటుంబాల్లో సంతోషాన్ని నింపింది. వారి అవసరాల కోసం ప్రభుత్వం రైతు కమిషన్‌ను ఏర్పాటు చేస్తే, అధికారులు మాత్రం దీన్ని పెత్తనంగా భావిస్తున్నారు. అందుకే, పైసా కూడా వ్యవసాయ శాఖ నుండి విడుదల కావడం లేదట. దీంతో సొంత ఖర్చులతోనే టీ, స్నాక్స్ తెప్పించుకుంటున్నారు సభ్యులు. అంతేకాదు, సొంత మనుషులనే సిబ్బందిగా వాడుకుంటున్నారట. ఈ ఇష్యూని సీఎం దృష్టికి తీసుకెళ్లే పనిలో కమిషన్ చైర్మన్, సభ్యులు ఉన్నారురైతు కమిషన్‌పై సీఎం రేంత్ రెడ్డి ఎంతో కృతనిశ్చయంతో ఉన్నారు. రైతుల పట్ల ఉన్న ప్రేమతో దీన్ని ఏర్పాటు చేశారు. కానీ, వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా వారిలో మార్పు రావాలి. నిజానిజాలు బయటకు తీసుకొస్తుంది. జాగ్రత్త ఆఫీసర్స్.

## బెంగళూరుకు హైడ్రా...

కర్నాటక స్టేట్ నేచురల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్ ను సందర్శించనున్నారు. అక్కడ సీనియర్ శాస్త్రవేత్తలతో రంగనాథ్ సమావేశమవుతారు. ఆ తరవాత అక్కడ నుండి సెన్సార్స్ సహాయంతో పర్యవేక్షిస్తున్న మురుగునీటి వ్యవస్థను పరిశీలించనున్నారు.అంతే కాకుండా బెంగుళూరు కోర్ సీటీలో ఉన్న చెరువులను సందర్శిస్తారు. అదే విధంగా రెండో రోజు పర్యటనలో భాగంగా లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్ తో సమావేశమవుతారు. ఈ సమావేశంలో కర్నాటక ట్యాంక్ కన్జర్వేషన్ అథారిటీ చట్టం 2014పై చర్చిస్తారు. అనంతరం ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని మార్గం దొడ్డిల్లీ చెరువు, ఇన్ఫోసిస్ సంస్థ అభివృద్ధి చేసిన చెరువులను సందర్శించి అక్కడ అమలు చేసిన ఉత్తమ విధానాలు, సాంకేతిక వ్యవస్థను తెలుసుకుంటారు. బెంగుళూరులో అధ్యయనం తరవాత హైదరాబాద్ లో చెరువుల పునరుద్ధరణకు ప్రణాళికను రచించనున్నారు. దీంతో రంగనాథ్ చెరువుల పరిరక్షణకై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

## ... పిచ్చిరాతలపై వార్నింగ్

మమ్మల్ని మానసికంగా దెబ్బ తీసేందుకు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారన్నారు. ఇలాంటి వారినెవ్వరిని వదిలి పెట్టే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తనతో ఆడుకోవాలని చూస్తే ఎవరిని వదిలి పెట్టనని కొవ్వు ఎక్కిన వారి కొవ్వు తగ్గిస్తానని హెచ్చరించారు. పోలీస్ వ్యవస్థ సైతం ఆలోచించుకోవాలన్నారు. నేరస్తుల కంటే మీరు అప్పర్ హ్యాండ్‌లో ఉండాలని పోలీసులకు సూచించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ బాగా ఉండాలని తాను మరోసారి చెబుతున్నానని పోలీసులకు స్పష్టం చేశారు. భావ వ్యక్తీకరణ పేరుతో ఎవరి పైనైనా పోస్టులు పెడతరా అని చంద్రబాబు ప్రశ్నించారు. అమరావతిలో కార్యక్రమాల తర్వాత చంద్రబాబు సచివాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనితతో సమావేశం అయ్యారు. ఢిల్లీ పర్యటన నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. సోషల్ మీడియాపై తీసుకునే చర్యలపైనా చర్చించినట్లుగా తెలుస్తోంది.

## మల్లారెడ్డికి ఈసీ నోటీసులు

పాటు సోదాలు చేసింది ఈడీ.లెక్కలు చూపని కోటి 40 లక్షల నగదు సీజ్ చేసినట్టు అప్పట్లో వెల్లడించింది. కాలేజీకి సంబంధించిన అకౌంట్లలో రెండు కోట్ల 89 లక్షలు నగదు సైతం సీజ్ చేసింది. అంతేకాదు హార్డ్ డ్రైవ్, పెన్ డ్రైవ్‌లతోపాటు పలు ఫైళ్లను స్వాధీనం చేసుకుంది.ఈ కేసు లోతుల్లోకి వెళ్తే.. రెండేళ్ల కిందట అంటే సరిగ్గా 2022 ఏప్రిల్‌లో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ప్లాన్ ప్రకారం పీజీ సీట్లను బ్లాక్ చేసి వాటిని ఎక్కువ రేటుకు అమ్ముకుంటున్నారని మెడికల్ యూనివర్సిటీ అధికారులు వరంగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ రంగంలోకి దిగేసింది. ఆపై సోదాలు నిర్వహించడం చకచకా జరిగిపోయింది.వాటికి సంబంధించి లేటెస్ట్‌గా ఈడీ ఎమ్మెల్యే మల్లారెడ్డికి నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే సేకరించిన వివరాలతో వారిని విచారించేందుకు సిద్ధమవుతోంది ఈడీ. అధికారుల విచారణలో ఇంకెన్ని విషయాలు వెలుగులోకి వస్తాయో చూడాలి.

## రేవంత్ రెడ్డి యాదాద్రి పర్యటన

జయభేరి, యాదాద్రి:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం అయన కుటుంబ సమేతంగా హెలికాప్టర్ లో ఉదయం 8:45 గంటలకు శ్రీ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. స్వామి వారి దర్శనం,ప్రత్యేక పూజల అనంతరం 10:00 గంటలకు వైటీడీయే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. 1:00 గంటకి వలిగొండ మండలం సంగెం గ్రామం చేరుకుంటారు. మూసి పరివాహక ప్రాంత రైతులతో మూసీ నది వెంట పాదయాత్ర ద్వార భీమలింగం, ధర్మారెడ్డి కాల్వల్ని సందర్శిస్తారు. అనంతరం మూసి పరివాహ ప్రాంతా రైతులతో సమావేశం అవుతారు. మూసి మురికి కూపంలో కొట్టుమిట్టాడుతున్న రైతుల యోగా క్షేమాలు అడిగి తెలుసుకుంటారు. రైతులతో సమావేశం అనంతరం తిరిగి హైదరాబాద్ బయలుదేరుతారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## ఒకే ఒక్కడు పుస్తకం ఆవిష్కరణ




జయభేరి, హైదరాబాద్:

విలక్షణమైన నాయకుడు రేవంత్ రెడ్డి. చిన్న వయసులో రాజకీయాల్లో డైనమిక్ లీడర్ గా ఎదిగిన వ్యక్తి రేవంత్ రెడ్డని టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. రేవంత్ రెడ్డి ప్రస్తానం పై రచయితలు వేణుగోపాల్ రెడ్డి, విజయార్కే రాసిన ఒకే ఒక్కడు పుస్తకాన్ని అయన ఆవిష్కరించారు. మహేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, నిర్బంధాలతో పాలన చేస్తున్న కేసీఆర్ పైన పోరాటం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి. శుక్రవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా పుస్తక ఆవిష్కరణ చేసుకున్నాం. ఒకే ఒక్కడు పుస్తకాన్ని రచించిన రచయితలకు అభినందనలు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి నుంచి ముందుగా రేవంత్ రెడ్డికీ పుట్టిన రోజు శుభాకాంక్షలు. నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఎక్కువ కాలం రాజకీయాల్లో ఉండాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు.

# నిర్లక్ష్యం నీడలో అధికారుల పనితీరు

జిల్లా పాలానాధికారి ఆకస్మిక తనిఖీలు... ప్రత్యేక సమీక్షలు సమావేశాలతో 24/7 కష్టపడుతున్నా అన్ని శాఖల్లో ఇంకా వీడని బద్ధకం... నిర్లక్ష్యం మంత్రి ఇలాకాలో కూడా అధికారుల తీరు మారదాయే





జయభేరి, పెద్దపల్లి

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ గా కోయ శ్రీహర్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుండి 24/7 విధులు నిర్వర్తిస్తూనే వున్నారు. అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేస్తూ, సమీక్షలు, సమావేశాలు, ఆకస్మిక తనిఖీలతో జిల్లాను జల్లెడ పడుతున్నారు. మండలం స్థాయి అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తూనే... విధుల్లో బాధ్యతలు లేని వారికి మెమోలు, సరెండర్లు, సస్పెండ్ లు చేస్తూనే ఉన్నారు. అర్ధరాత్రి సైతం లెక్క చేయకుండా ఆకస్మికంగా తనిఖీలు చేస్తూ తన ఉద్యోగానికి న్యాయం చేస్తూనే ఉన్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో మాత్రం వారి విధులు నిర్వహించడంలో చిత్తశుద్ధి కానరావడం లేదు కదా తోటి అధికారిని చూసి మారుదామనే ఆలోచన లేదు. సమయానికి జీతం డబ్బులు వస్తే సరిపోతుంది అనుకునే అధికారులు వున్నంతవరకు ఈ వ్యవస్థలో మార్పు రాదనే చెప్పాలేమో. ఈ నిర్లక్ష్యం ఖరీదు విద్యార్థుల ప్రాణం మీద కు వచ్చిన సంఘటన పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం మండలం లోని కేజీబీవి హాస్టల్ లో జరిగింది. పర్యావరణ సంబంధిత సమస్యలా లేక ఆహరం కల్తీ తెలియని సందిగ్ధం. మొత్తానికి విద్యార్థులు కోలుకోవడం ఆనందమే అయినా జరిగిన పరిణామానికి ఎవరు బాధ్యత వహిస్తారు. మళ్ళీ తల్లి తండ్రులు పాఠశాలకు పంపాలంటే ఎన్నో భయాలు. హాస్టల్ పక్కనే ఉన్న డంపు యార్డు మూలంగా సమస్య వచ్చిందా మరే ఇతర కారణం ఏదైనా కూడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఇక జిల్లా కేంద్రం మొదలు కొని మండలం, గ్రామ స్థాయి అధికారుల్లో

**రాష్ట్ర మంత్రి కేంద్రంగా ఉన్న జిల్లాలో కూడా నిర్లక్ష్యమేనా… రాష్ట్ర మంత్రిగా దుద్దిల్ల శ్రీధర్ బాబు జిల్లా కేంద్రంలోని మంథని నియోజకవర్గానికి చెందిన వ్యక్తి అయినా అధికారులకు భయం, భక్తి లేకుండా పోతున్నది. విధులు నిర్వహణలో అదే నిర్లక్ష్యం. సమయ పాలన లేదు. స్థానికంగాఉండరు. ఇలాంటి వారికి కొంతమంది ఉన్నతాధికారులు వంత పాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనా అధికారులు మారితే గాని వ్యవస్థలో మార్పు రాదనే భావన ప్రజలల్లో బలంగా నాటుకు పోయింది.**

విధుల నిర్వహణలో అశ్రద్ధ, బాధ్యత లేని తనం కనిపిస్తూనే ఉంటున్నాయి. వైద్య, విద్య, రెవెన్యూతోపాటు ప్రతి శాఖలో అవినీతి ప్రధాన సమస్యగా మారింది. దీనికి తోడు సమయ పాలన లోపం. అధికారులు కార్యాలయాలకు ఎప్పుడు వస్తున్నారో... ఎప్పుడు వెళుతున్నారో తెలియని వైనం. అందులో పని చేసే అధికారికి క్రింద స్థాయి అధికారుల విషయమే పట్టింపు లేదు. తూతు మంత్రంగా డ్యూటీలు... మళ్ళీ బయట దందాలు... ఈ వ్యవహారం ముఖ్యంగా వైద్య, విద్యా శాఖలో ఎక్కువగా కనిపిస్తున్నది. ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ ఆసుపత్రి నడప రాదనే నిబంధనలను వారు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. బయట ప్రైవేట్ ఆసుపత్రి పెట్టి మరో డాక్టర్ తో మ్యానేజ్ చేస్తున్నారు. ఇక్కడి రోగులు అక్కడికి తరలించుకు పోవడంలో తెలివిని ఉపయోగిస్తూ తప్పించుకుంటున్నారు. ఇక విద్యా వ్యవస్థలో అధికారులు, ఉపాధ్యాయులు చాలా మంది రియల్, చైన్ మార్కెటింగ్ దందాలు విధుల సమయంలోనే చక్కబెడుతున్నారు. జిల్లాలోని పలు శాఖల్లో అధికారుల విధుల కోసం ప్రభుత్వం వారికి అద్దె ప్రతిపాదికన వాహనాలు కేటాయించారు. కానీ వారు వారి స్వంత వాహనాలు పెట్టుకోని దొంగ బిల్లు పెట్టి మోసాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కారు అసోసియేషన్ తరుపున ఓ జిల్లా అధికారిని సంప్రదిస్తే స్పందించక పోగా, వారిపై దురుసుగా మాట్లాడినట్లు సమాచారం. ఇంకా రెవెన్యూ, రవాణా శాఖ, సబ్ రిజిస్టర్, అబ్కారీ శాఖల్లో అయితే పట్ట పగ్గాల్లేని అవినీతి జరుగుతుందనడంలో అతిశయోక్తి లేదేమో. కిరాణా షాపుల్లోనే బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నా, నిత్యం అటు గుండా వెళ్లే అధికారులు చూసి చూడనట్లు ఉండే వైనం. రౌతు సక్రమంగా ఉన్నా, పని చేయని దొంగ గుర్రాలతో పని చేయించడం కష్టమేననే భావన పలువురిలో వ్యక్తమవుతున్నది. జిల్లా కేంద్రంలోనే ఇలాంటి అధికారులు ఉంటే ఇక మండలం, గ్రామ స్థాయిల్లో చెప్పనలవి కానీ బాధలు. ఇటీవల మత్స్య శాఖలో కూడా చేప పిల్లల పంపిణి వ్యవహారంలో పలు అవినీతి ఆరోపణలు బలంగా వినిపించాయి. నిజాయితీగా పని చేసే అధికారులు లేకుండా పోతున్నారనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. కాగా ఇటీవల విధుల నిర్వహణలో అశ్రద్ధ చూపుతున్న పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక పోలీస్ శాఖలో అయితే ఆపరేషన్ గరుడ పేరుతో ఎన్ని విజయాలు సాధించారో వారికే తెలియాలి. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు ఎక్కువ శాతం పోలీస్ వ్యవస్థ సీసీ కెమెరాల జపంతోనే కాలం గడిచి పోతున్నది. జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల మండల కేంద్రాలు పదుల సంఖ్యలో పోలీస్ ఠాణాలు ఉన్నా దొంగలను పట్టుకునే స్థాయిలో లేకపోవడం శోచనీయని పలువురు బహిరంగానే పేర్కొంటున్నారు. గడిచిన ఎనిమిది నెలల కాలంలో జిల్లా కేంద్రంలో పలు దొంగతనాలు జరిగినా వాటి చేదనలో ఇంకా మీనమెషాలే నడుస్తున్నాయి. సివిల్ కేసుల్లో ఉత్సాహం చూపే పోలీసులు, ప్రజా సమస్యల పరిష్కారంలో తేలిపోతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంత చెప్పినా తక్కువే అవుతున్నది.

# 5ఏళ్లలో ఎపి విద్యారంగాన్ని నెం.1గా తీర్చిదిద్దుతాం!




వంటి నవీన ఆవిష్కరణలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ... యువత ఉద్యోగం సాధించడంపై కాకుండా జాబ్ క్రియేటర్స్ గా తయారుకావాలని అన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని స్టార్టప్‌లను ప్రారంభించాలన్నారు. ఇందుకు ఎపి ఇన్నొవేషన్ సొసైటీ సంపూర్ణ సహాయ, సహకారాలను అందిస్తుందని, రూ.250కోట్లతో సీడ్ ఫండ్ ను కూడా ఏర్పాటుచేశామని చెప్పారు. విశాలమైన ఆలోచనా దృక్పథంతో ముందుకుసాగుతూ యువత తమ కలలను సాకారం చేసుకోవాలని అన్నారు. నైతిక విలువలతో కూడిన విద్యావ్యవస్థను తయారుచేయడమే మా లక్ష్యం.

**రాబోయే పాతికేళ్లు భారత్ యుగం..**

అంతర్జాతీయంగా వస్తున్న అధునాతన సాంకేతిక మార్పులకు అనుగుణంగా పునరావిష్కరణలపై దృష్టిసారించాలి. అవుట్ పుట్స్ పై కాకుండా అవుట్ కమ్స్ పై విట్ వంటి విద్యాసంస్థలు శ్రద్ధవహించాలి.

**గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి..**

జీవితంలో యువత గెలుపే ఏకైక లక్ష్యంగా ముందుకు సాగాలి. అంతర్జాతీయ పరిణామాలను గమనిస్తూ నవీన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలి. స్టాన్ ఫోర్డ్ లో ఎంబిఎ చేశాక 2005లో నేను ప్రపంచబ్యాంకులో పని చేశాను. అందరి లాగానే నేను కూడా ఒడిదుడుకులను చవిచూశాను. 2017లో రాష్ట్రమంత్రిగా ఎంతో అభివృద్ధి చేశాను. 1985తర్వాత ఎప్పుడూ గెలవని మంగళగిరిలో 2019 ఎన్నికల్లో నేను పోటీచేశాను. మంగళగిరి ప్రజలు నన్ను 5300 ఓట్లతో ఓడించారు. రెండు, మూడు రోజులు బాధపడ్డా. తర్వాత అయిదేళ్లు ప్రజలకు అండగా నిలబడ్డారు. ఇటీవల ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో ప్రజలు నన్ను గెలిపించారు. యువత కష్టసుఖాలను సమానంగా స్వీకరిస్తూ లక్ష్యసాధనకోసం ముందుకు సాగాలి. అందుకు నన్ను ఉదాహరణగా తీసుకోవాలి. ప్రస్తుతం రాష్ట్రంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి. అమరావతి రాజధాని పనులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. తాము ఎంచుకున్న రంగంలో ఉన్నతస్థాయికి చేరేందుకు ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేయాలి.

**ప్రపంచస్థాయి నగరంగా అమరావతి..**

గత అయిదేళ్లు ఆంధ్రప్రదేశ్ చీకటిరోజులను చవిచూసింది. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు నేతృత్వాన మళ్లీ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 150రోజులుగా అభివృద్ధి పట్టాలెక్కింది. పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పుడు ముందుకు వస్తున్నారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ విధానానికి కట్టుబడి పని చేస్తున్నాం. అమరావతిని సకల సౌకర్యాలతో ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. ప్రధాని మోడీ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఎపి సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నాం. రాబోయే పాతికేళ్లలో ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగేందుకు అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను $ 2 ట్రిలియన్ డాలర్ల ఎకనామీగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. రాబోయేరోజుల్లో ఎపిని దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయంగల రాష్ట్రంగా తయారుచేస్తాం. 1980, 90 దశకాల్లో వచ్చిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను మార్చేశాయి. అందులో భాగంగా వచ్చిన అవకాశాలను ఉపయోగించుకొని చంద్రబాబునాయుడు సైబరాబాద్ ను నిర్మించారు. ఫలితంగా ఈరోజు భారత సాఫ్ట్ వేర్ రంగంలో 20శాతం మంది తెలుగువారే ఉన్నారు. ప్రపంచస్థాయి దిగ్గజ కంపెనీలైన మైక్రోసాఫ్ట్, గూగుల్, అడోబ్, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి సంస్థల్లో భారతీయులు కీలకస్థానాల్లో ఉన్నారు. చైనా, అమెరికా, జపాన్ మోడల్ ను కాకుండా భారత్ మోడల్ విద్యా వ్యవస్థను ఇతర దేశాలు అనుసరించే తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

**బలమైన విద్యావ్యవస్థకు కలసి పనిచేద్దాం..**

ఎపి విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విశ్వవిద్యాలయాలతో కనెక్ట్ కావడానికి విట్ - ఎపి వేదికను అందించడం అభినందనీయం. అమరావతికి ప్రపంచం నలుమూలల నుంచి విదేశీ యూనివర్సిటీల ప్రతినిధులు రావడం హర్షణీయం. యువత ఆకాంక్షలకు మద్దతుగా నవీన ఆవిష్కరణలు, పరిశోధనలు, అకడమిక్ ఎక్సలెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉండేలా బలమైన విద్యావ్యవస్థ నిర్మాణానికి కలిసి పని చేద్దాం. ఈ ఈవెంట్ ద్వారా ఎపి విద్యార్థులు సాధించే విజయ గాథల కోసం నేను ఎదురు చూస్తాను.

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగస్వాములైన అన్ని విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు మంత్రి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. భారత్ లో విద్యారంగ బడ్జెట్ పెరగాల్సిన అవసరం ఉందని విట్ ఎపి చాన్స్ లర్ జి.విశ్వనాథన్ అభిప్రాయపడ్డారు. గత ఏడాది కేంద్రబడ్జెట్ లో విద్యారంగానికి బడ్జెట్ లో కేవలం 2.9శాతం మాత్రమే కేటాయించారు.

అభివృద్ధి చెందిన దేశాల్లో విద్యారంగానికి 4నుంచి 6శాతం వరకు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విట్ ఏపీ వ్యవస్థాపకుడు జి. విశ్వనాథన్, వైస్ చాన్సలర్ ఎస్.వి. కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర మురుగన్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ కోఆర్డినేటర్ గోస్వామి, ప్రొఫెసర్ రీతు వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సుస్థిర పాలన

✍ జయభేరి, ఘట్కేసర్ :

పోచారం మున్సిపాలిటీ లో 30 లక్షల ప్రత్యేక నిధులతో పనులు శంకుస్థాపన చేసిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చొరవతో మేడ్చల్ నియోజకవర్గానికి 10 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరులో భాగంగా గురువారం పోచారం మున్సిపల్ లోని NTPC 30 లక్షల వ్యయంతో బీట్ రోడ్ పనులకు టీపీసిసి ఉపాధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, టీం రేవంతన్న రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, పోచారం మున్సిపాలిటీ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఘట్కేసర్ మండల్ అధ్యక్షులు కర్రె రాజేష్, పోచారం మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు బాలాగోని వెంకటేష్ గౌడ్, సింగిరెడ్డి సాయి రెడ్డి, ఘనపురం మాజీ సర్పంచ్ బద్దం గోపాల్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటి డైరెక్టర్ చిలకూరి



మచ్చేందర్ రెడ్డి, మాజీ MPTC భాస్కర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఇటిక్యాల బాల కృష్ణ రెడ్డి, పల్లె బాబు రావు, మాజీ వార్డు సభ్యులు భోజీ రెడ్డి, మంచాల సుధాకర్, నానావత్ సురేష్ నాయక్, మూడవత్ సుధాకర్ నాయక్, మున్సిపల్ పార్టీ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెట్టు నర్సింహా రెడ్డి, బద్దం నర్సింహ రెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, బాలాగోని విజయ్ గౌడ్, దేవేందర్ ముదిరాజ్, పల్లపు రమేష్, వరికుప్పల వెంకటేష్, సింగిరెడ్డి బాల్ రెడ్డి, వల్లమల్ల ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు బద్దం రుకవర్ధన్ రెడ్డి, యుగేందర్ రెడ్డి, పోచారం మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు మాధవి, మహిళ నాయకురాలు పద్మావతి, శశికళ, వంగల లక్ష్మి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే ఆకస్మిక పర్యటన

✍ జయభేరి, ఉప్పల్ :


నాచారం డివిజన్ లో స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ తో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకస్మికంగా పర్యటించారు. డ్రైనేజీ వ్యవస్థ గురించి కార్పొరేటర్ అడగగా వెంటనే పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన సూచించారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. రాష్ట్రంలోనే ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్ DGM సతీష్, అధికారులు, BRS పార్టీ నాయకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



✍ జయభేరి, ఘట్కేసర్ :

పోచారం మున్సిపల్ పరిధిలోని వెంకటాపురం, చౌదరిగుడా, కొర్రేముల, సాదాత్ ఆలిగుడా, ప్రతాప సింగారం కచావని సింగారం, ముత్వెల్లి గూడలో సానిటేశన్ స్పెషల్ డ్రైవ్ ను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. గురువారం పోచారం మున్సిపల్ పరిధిలో సానిటేశన్ స్పెషల్ డ్రైవ్ ను పరిశీలించి.. ప్రతాప సింగారంలోని డబుల్ బెడ్రూమ్ ల వద్ద కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ.. విలీన గ్రామాలలో జేసిబి, డోజర్, ట్రాక్టర్లు, మొదలగు యంత్రాలతో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్, శానిటరీ ఇన్స్పెక్టర్ వాణి, మున్సిపల్ సిబ్బంది, వివిధ కాలనీ వాసుల తదితరులు పాల్గొన్నారు.





## అయోమయ పాలనలో రేవంత్ సర్కార్...

- రీజినల్ రింగ్ రోడ్డు పనులు ఏమాయే
- గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి

✍ జయభేరి, గజ్వేల్, నవంబర్ 07:

అయోమయ పాలనలో కాంగ్రెస్ సర్కార్ ఉందని అసమర్ధ పాలనతోనే రీజినల్ రింగ్ రోడ్ పనులు ఆగిపోయినట్లు వంటేరు ప్రతాప్ రెడ్డి ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ పాలన గాలిలో దీపం పెట్టి మొక్కినట్లు ఉందని ప్రతాప్ రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధానాల వలన తెలంగాణ రాష్ట్రంలోని రెవెన్యూ ఆదాయం తగ్గిపోయిందని వారు తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం మరియు ఇతర వ్యాపారాలు దిగజారిపోవడం వ్యాపారవేత్తలు ఆందోళనకు గురవుతున్నారని వంటేరు ప్రతాప్ రెడ్డి ఆరోపించారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి పెట్టుబడి సమయంలో రైతు బంధుతో ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సహాయం చేయకుండా రైతుల నోట్లో మట్టి కుట్టిందని కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు. అమలు కానీ ఆరు గ్యారెంటీలను హామీలు ఇచ్చి కనీసం ఇప్పటివరకు ఏ ఒక్క గ్యారెంటీ కూడా అమలు చేయలేదని వంటేరు ప్రతాప్ రెడ్డి తెలిపారు. 420 హామీలు ఇచ్చి అమలు కానీ ఆరుగ్యారంటీలు ఇచ్చి తెలంగాణ రాష్ట్ర ప్రజలను తెలంగాణ రైతాంగాన్ని ఆగం చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని పేర్కొన్నారు. రోజుకో డ్రామాతో కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి కాంగ్రెస్ మంత్రులు రాబందుల్లాపడి తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని తెలంగాణ రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసారని వంటేరు ప్రతాప్ రెడ్డి హెగ్దేవ చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



✍ జయభేరి, పరవాడ:

పరవాడ మండలం వాడ చీపురుపల్లి సబ్ స్టేషన్ 11kv ఫీడర్ల నందు నిర్వహణ పనులు, చెట్ల కొమ్మలు తొలంగింపు గురించి శుక్రవారం ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఇపిడిసిఎల్ కశింకోట డివిజన్ ఈ ఈ ఎస్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలియజేసారు. నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, దోసురు గ్రామాలకు తెలిపిన సమయంలో విద్యుత్ అంతరాయం కల్గుతుందని వినియోగదారులు అందరూ అంతరాయన్ని గమనించగలరని అని ప్రకటనలో తెలియజేసారు.

## మెరుగైన వైద్యం అందించాలని సంకల్పంతో బస్తి దవాఖాన ఏర్పాటు

✍ జయభేరి, ఘట్కేసర్ :

ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో పర్యటించిన ఘట్కేసర్ మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్. ఈ సందర్భంగా చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఘట్కేసర్ మున్సిపాలిటీ 16వ వార్డులో పర్యటిస్తు వార్డు ప్రజలకు ప్రయివేట్ చెత్త సేకరణ వాహనాన్ని ఏర్పాటు చేశామని.. కావున ప్రతి ఒక్క రు తడి చెత్తపొడి చేత వేరు చేసి చెత్త సేకరణ వాహనానికి అందించాలని, అదేవిధంగా చెత్త సేకరణ వాహనానికి ఏ ఒక్కరు కూడా డబ్బులు ఇవ్వకూడదని, చెత్త సేకరణ వాహననికి వార్డు ప్రజల తరపున వాహనానికి అయ్యే ఖర్చు తాము సొంతంగా ఇస్తామని తెలిపారు. మున్సిపాలిటీ ప్రజలు ప్రతి ఒక్కరు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని మన ఇంటి ముందుకి వస్తున్న చెత్త సేకరణ వాహనాలకు అందించాలని, చెత్త సేకరణ వాహనం రాని వారు, సంబంధత కౌన్సిలర్ కి ఫిర్యాదు




చేయాలని తెలిపారు. అదేవిధంగా వార్డులో ఉన్న బస్తి దవాఖానలో సందర్శించి షుగర్ టెస్ట్ కి కావాల్సిన పరికరాలు ఏర్పాటు చేయడం జరిగిందని.. కావున రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని వారికి ఏదైనా సుస్తి చేస్తే వారికి ప్రైవేట్ హాస్పిటల్ కి వెళ్లే స్తోమత ఉండదని వారి కోరారు. మంచి వైద్య అధికారులచే వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించి వారికి మెరుగైన వైద్యం అందించాలని సంకల్పంతో బస్తి దవాఖాన ఏర్పాటు చేశామని.. అర్హులైన ప్రతి ఒక్కరు ఉచితం వైద్యం పొందాలని, అనంతరం ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు షాషా, లల సెట్, లక్ష్మి, కెస్కార్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల పాలిట శాపంగా మారిన "ది కాంటినెంట్" హోటల్

✍ జయభేరి, ఘట్కేసర్ :

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధి అంకుశాపూర్ గ్రామంలో "ది కాంటినెంట్" హోటల్ ప్రజల పాలిట శాపంగా మారింది, సదురు హోటల్లో పెళ్ళిలు ఇతర ఫంక్షన్లు జరిగినప్పుడు వాటికి సంబంధించిన మురుగు నీరును ఇతర చెత్తను రోడ్డు పై పడేస్తున్నారు. హోటల్ సిబ్బంది, దీంతో టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా, డయేరియా తదితర భయంకరమైన ప్రాణాంతక వ్యాధులు సంభవించి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడింది, ఇదే కాకుండా పార్కింగ్ కూడా రోడ్డు పై చె





య్యడంతో గ్రామంలో రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం కలుగుతుంది, వీరి వాహనాల పార్కింగ్ కోసం ఏకంగా హరితహారం చెట్లను సైతం ధ్వంసం చేసింది సదురు హోటల్ యాజమాన్యం, ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు కానీ సంబంధిత శాఖల అధికారులు కానీ అటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు "ది కాంటినెంట్" హోటల్ పై చర్యలు తీసుకొని ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కులగణన సర్వే దేశానికే ఆదర్శనంగా నిలుస్తుంది

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

✍ జయభేరి, పరకాల, నవంబర్ 7:

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కులగనన సర్వే కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. పరకాల పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో గురువారం ఇంటింటా సమగ్ర కుటుంబ కుల గణన సర్వే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే ద్వారా వెనుకబడిన వర్గాల ప్రజల సామాజిక ఆర్థిక స్థితిగతులు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి



కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. ప్రతి 150 ఇండ్లకు ఒక ఎన్యూమిలేటర్ ను నియమించారని వారు ప్రతి ఇంటికి వచ్చి స్టిక్కర్ వేసి సర్వ్ కు కావల్సిన పత్రాలను. ముందుగా వివరిస్తారని అన్నారు. సర్వే ద్వారా సేకరించిన వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని, ఎవరికి సమాచారాన్ని వెల్లడి చేయడం జరగదని ప్రజలు వివరాలు ఇచ్చే విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## ఆవాలతో ముఖ్యమంత్రి చిత్రాన్ని చిత్రించిన రామకోటి

- రామకోటి రామరాజును సన్మానించిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్




✍ జయభేరి, గజ్వేల్, నవంబర్ 07 :

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపకులు భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు రేవంత్ చిత్రాన్ని అవాలతో అత్యఅద్భుతంగా చిత్రించి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ కు ఆ చిత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ మాట్లాడుతూ మన తెలంగాణ ముఖ్య మంత్రి చిత్రం చిత్రించిన ఆయన కళ ఎంత గొప్పదో తెలియజేశారు. ఇలాంటి కళాకారులు మన గజ్వేల్ లో ఉండడం మన అదృష్టం అన్నారు. సామాజికంగా, ధార్మికంగా ముందుండి ఎన్నో గొప్ప కార్యక్రమాలు నిర్వహించిన రామకోటి రామరాజు ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. మరెన్నో కళలలు శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నక్క రాములు, సాధక్ పాషా, స్వామి, కొడకండ్ల బాలు, అహ్మదిపూర్ బాలు, డప్పు గణేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

- తాజా మాజీ ఎంపీపీ పాండు గౌడ్



✍ జయభేరి, గజ్వేల్ మార్కుక్ :

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తి గ్రామనికి చెందిన కోనమైన మదారి అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న తాజా మాజీ ఎంపీపీ పాండు గౌడ్ గురువారం రోజు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సహాయం అందజేశారు. వారితో పాటు మ్యాకల శ్రీనివాస్, బాలస్వామి, నర్సింలు సదుల్లా, తదితరులు ఉన్నారు.

# అసమానతలు లేని సమాజం కోసమే సర్వే

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**జయభేరి, పరకాల, నవంబర్ 7:**

అసమానతలు లేని సమాజమే లక్షంగా సమగ్ర కుటుంబ కుల గణన సర్వే అని ప్రతి యొక్కరు సర్వే కు సహకరించాలని పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు మండలం పెద్దాపురం గ్రామంలో ఇంటింటా సమగ్ర కుటుంబ కుల గణన సర్వే కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం డోర్స్ కి స్టిక్కర్స్ వేస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కులగనన ఇది దేశంలోనే మొదటి సర్వే అని ఈ సర్వే దేశంలోనే ఆదర్శ సర్వే గా నిలుస్తుందని ప్రతి ఒక్కరు సమాజంలో ఏ స్థాయిలో ఉన్నారో ఈ సర్వే తో తెలుస్తుందని అన్నారు. ప్రతి 150 ఇండ్లకు ఒక ఎన్యూమరేటర్ ను నియమించారని వారు ప్రతి ఇంటికి వచ్చి స్టిక్కర్ వేసి సర్వే కు కావల్సిన పత్రాలను. ముందుగా వివరిస్తారని అన్నారు.నియోజకవర్గంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందిగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్యూమరేటర్లు అధికారులు ప్రతీ కుటుంబానికి ముందస్తు పూర్తి సమాచారం ఇచ్చి ప్రజలకు సహకరించి సర్వే పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని కోరారు.





# బాలుర హైస్కూల్లో సైకిల్ స్టాండ్ ప్రారంభం

**జయభేరి, పరవాడ:**

మండల కేంద్రం అయ్యిన పరవాడ బాలుర హై స్కూల్ లో ఎన్టీపీసీ వారి సీఎస్ఆర్ కార్యకలాపాలలో భాగంగా గురువారం ఎన్టీపీసీ చీఫ్ సెంట్రల్ మేనేజర్ ఎస్. సిన్హా ముఖ్య అతిథిగా పాల్గొని సైకిల్ స్టాండ్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ కమ్యూనిటీ అభివృద్ధికి నిరంతరం నిబద్ధతతో కృషి చేస్తుందని అందులో భాగంగా విద్యార్థులకు సురక్షితమైన సైకిల్ పార్కింగ్‌ను సులభతరం చేయడానికి నిర్మిచాము అని అన్నారు అలాగే పరవాడ జూనియర్ కళాశాలలో విద్యార్థుల అవసరం నిమిత్తం ఎన్టీపీసీ రెండవ సైకిల్ షెడ్‌ను కూడా నిర్మించిందని ఇవే కాకుండా స్థానిక భవిత కేంద్రంలో అదనంగా సరిహద్దు గోడ కట్టడం పూర్తి చేసిందని దాని వలన ఆ ప్రాంగణం యొక్క భద్రతను పెంచుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎస్ అప్పలనాయుడు,పాఠశాల ఉపాధ్యాయులు,ఎన్టీపీసీ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తోనే సాధ్యం




**జయభేరి, పరవాడ:**

జాతీయ అసంక్రమిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ హారిక ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తోనే సాధ్యమని ముందస్తు పరీక్ష ద్వారా క్యాన్సర్ నుండి కాపాడుకోవచ్చని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ హెల్త్ ప్రొవైడర్లు మరియు హెల్త్ సెక్రటరీలు,ఆశా కార్యకర్తలు ఆరోగ్య బృందాలుగా ఏర్పడి 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి,బ్రెస్ట్ క్యాన్సర్,సర్వైకల్ క్యాన్సర్,ఓరల్ క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.ఎస్.ఎస్. సాయిరాం స్టాఫ్ నర్స్ భవాని,ఫార్మసిస్ట్ విజయకుమారి ఎల్. టి. అన్నపూర్ణేశ్వరి,హెల్త్ అసిస్టెంట్ ఎమ్. శ్రీనివాస్, తదితరులు పాల్గున్నారు.

# ఎన్టీపీసీ సింహాద్రిలో 50వ రైజింగ్ డే వేడుకలు




**జయభేరి, పరవాడ:**

ఎన్టీపీసీ సింహాద్రి నోయిడాలోని ఈఓసి కాంప్లెక్స్‌లో 50వ ఎన్టీపీసీ రైజింగ్ డేని అడ్మినిస్ట్రేటివ్ భవన ప్రాంగణంలో జరుపుకున్నారు. రైజింగ్ డే సెలబ్రేషన్స్ స్క్రీనింగ్‌తో గోల్డెన్ జూబ్లీ వేడుక ప్రారంభమైంది, ఈ సందర్భంగా సీఎండీ ఎన్టీపీసీ గురుదీప్ సింగ్ ఉద్యోగులను ఉద్దేశించి గర్వంగా మరియు ఉత్సాహంగా ప్రసంగించారు.ప్రాజెక్ట్ హెడ్ సంజయ్ కుమార్ సిన్హా ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించారు. సంస్థ యొక్క 50 సంవత్సరాల సుదీర్ఘ అద్భుతమైన చరిత్రను మరియు 76,476 మెగావాట్స్ వరకు ప్రయాణాన్ని హైలైట్ చేశారు. రాబోయే సంవత్సరాల్లో నిర్దేశించబడిన అన్ని మైలురాళ్లను చేరుకోవడానికి కొత్త శక్తితో కష్టపడి పనిచేయాలని అతను ఉద్యోగులను ఉద్దేశించి అన్నారు అలాగే ఎన్టీపీసీ & సింహాద్రి ప్రాజెక్ట్‌కి ఇటీవలి కాలంలో వివిధ రంగాలలో లభించిన అవార్డులు మరియు ప్రశంసలను ప్రస్తావించారు. ఈ వేడుకల్లో భాగంగా కేక్ కట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. NTPC యొక్క కొత్త 50 సంవత్సరాల వేడుక లోగో కూడా సింహాద్రిలోని 3 వేర్వేరు ప్రదేశాలలో అమర్చారు.ఈ కార్యక్రమంలో సంస్థ ఉన్నతిధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పరవాడలో ఎన్టీపీసీ సింహాద్రి సోలార్ వీధి లైట్ల వెలుగులు



**జయభేరి, పరవాడ:**

మండల కేంద్రం అయ్యిన పరవాడకి ఎన్టీపీసీ సింహాద్రి వారి సామాజిక బాధ్యతలో భాగంగా సిఎస్ఆర్ నిధులు నుంచి 42 సోలార్ వీధి లైట్లును కేటాయించినట్టు ఎన్టీపీసీ సిఎస్ఆర్ అధికారులు తెలియజేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో సోలార్ వీధి లైట్లు వాడడం వలన కరెంట్ వాడకం తగ్గి పంచాయతీకి గ్రామం పై ఉన్న కరెంట్ ఖర్చులు తగ్గుతాయి అనే ఉద్దేశ్యంతో సిఎస్ఆర్లో ఈ ప్రాజెక్ట్ తీసుకొన్నాము అన్నారు. ఇంతక క్రితం సోలార్ వీధి లైట్స్ రావాడ పంచాయతీకి అందజేసాము అని తెలిపారు. ఈ యొక్క సొలర్ వీధి లైట్లకి సంబంధించిన పనులను గురువారం గ్రామ వీధులలో పంచాయతీ అధికారులు, పంచాయతీ నాయుకులు చెప్పిన ప్రదేశలలో కాంట్రాక్టర్ మొదలు పెట్టారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు లబ్ధి

**జయభేరి, జగదేవపూర్, నవంబర్ 07 :**



ఆయిల్ పామ్ సాగు లో సరైన మెలకువలు పాటించి లబ్ధి పొందాలని మండల వ్యవసాయ అధికారి వసంతరావు మరియు హార్టికల్చర్ ఆఫీసర్ సౌమ్య తెలిపారు. గురువారం జగదేవపూర్ మండలంలోని చాట్లపల్లి గ్రామపంచాయతీలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వసంతరావు మాట్లాడుతూ వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే ఆయిల్ ఫామ్ సాగు ఒక్కటే పరిష్కారం అని, ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతుకు బంగారు భవిష్యత్తు ఎందుకనగా ఆయిల్ పామ్ 30 సంవత్సరాల దీర్ఘ కాలిక పంటని నాలుగో సంవత్సరం దిగుబడి మొదలై 30 సంవత్సరాలు వరకు ప్రతినెల రెండు కోతలతో సంవత్సరం పొడుగునా దిగుబడులతో రైతు అధిక ఆదాయాన్ని పొందవచ్చని తెలియజేశారు. ఆయిల్ పామ్ సాగులో ఖర్చు చాలా తక్కువని, కూలీల అవసరం చాలా వరకు తగ్గుతుందని, ఒక వ్యక్తి 10 ఎకరాల ఆయిల్ పాం తోటను సులువుగా పరివేక్షించవచ్చని తెలిపారు. ఆయిల్ ఫాం సాగు వల్ల నిరంతర దిగుబడి ఆదాయంతో రైతుల ఆర్థిక పురోగతి అత్యున్నత దశకు చేరుకొని రైతు మాత్రమే కాకుండా రైతుల భావితరాలు కూడా ఆయిల్ ఫామ్ తో లబ్ధి పొందే అవకాశం ఉందని అన్నారు. హార్టికల్చర్ ఆఫీసర్ సౌమ్య మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగులో చీడపీడలు మరియు కోతుల బెడద చాలా తక్కువ అని తుఫానులు గాలి వానలు వడగండ్ల వల్ల పంటకు ఎలాంటి నష్టం వాటిల్లదని రైతులకు సెక్యూరిటీ కలిగిన ఒకే ఒక పంట ఆయిల్ ఫామ్ అని అన్నారు. ఎకరానికి 57 ఆయిల్ పామ్ మొక్కలు 9x9x9 మీటర్లు త్రిభుజాకార పద్ధతిలో నాటుకుంటే సరిపోతుందని, మొదటి నాలుగు సంవత్సరాలు అంతర పంటలు పండించుకోవచ్చని దీనికి ప్రభుత్వం నుండి సంవత్సరానికి ఎకరానికి 4200/ రూపాయలు 4 సంవత్సరాలు వరకు వస్తాయని తెలియజేశారు.

4 సంవత్సరం నుండి ఆయిల్ పామ్ దిగుబడి ప్రారంభమవుతుందని ఎకరాకు సంవత్సరం మొత్తం మీద పది నుండి 12 టన్నుల వరకు గెలల దిగుబడి వస్తుందని, ఎకరానికి ఖర్చు సంవత్సరానికి 25 వేలకు మించదని, సంవత్సరానికి ఖర్చులు పోను నికరంగా ఎకరానికి కనీసం 1లక్ష రూపాయల మిగులుతుందని తెలిపారు. ఆయిల్ పామ్ పండించే రైతులకు కేవలం 20 రూపాయలకే (90% సబ్సిడీ పై) మొక్కలు అందించడం జరుగుతుందని అలాగే డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు కూడా 80 నుండి 90% సబ్సిడీ మీద అందించడం జరుగుతుందని కావున రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయిల్ పామ్ తోటను పరిశీలించి రైతుకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ విజయ్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి కృష్ణమూర్తి మరియు రైతులు పాల్గొన్నారు.

# ఫార్మాసిటీ రామ్ కి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

**జయభేరి, పరవాడ:**




ఫార్మసిటీ రామ్ కి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్ వి ప్రసాద్ నేత్రాలయం వారి సహకారంతో గురువారం రామ్ కీ ఫౌండేషన్ ఆఫీసు నందు ఉచిత నేత్ర వైద్య శిబిరంను స్థానిక డి.ఎస్.పి కెవి సత్యనారాయణ చేతులు మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సమయానికి కళ్ళ చికిత్స చేసుకోకపోవడం వల్ల చాలామంది అంధత్వానికి గురి అవుతున్నారని ముందుగా సమస్యను గుర్తించి చికిత్స చేయడం ద్వారా అంధత్వాన్ని నివారించవచ్చనని అన్నారు. క్రమం తప్పకుండా వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నందుకు రామ్ కీ ఫౌండేషన్ వారికి అభినందనలు తెలియజేశారు. ఈ శిబిరంలో సుమారు 153 మంది హాజరు అయ్యి వైద్య పరీక్షలు చేయ్యుంచుకొన్నారు. రామ్ కీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కే. శ్రీకాంత్ మాట్లాడుతూ అర్హులైన అందరికీ ఉచితంగా కంటి అద్దాలు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ బక్షి మాట్లాడుతూ రామ్ కీ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలను సమీప గ్రామ ప్రజలు, దినసరి కార్మికులు, జేఎన్పిసి ఉద్యోగులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ హెచ్ ఆర్ భరత్, రామ్ కి ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, మహిళా కోఆర్డినేటర్ రాజేశ్వరి, ఎల్ వి ప్రసాద్ ఐ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా విగ్రహాల ప్రతిష్ట, ఊరేగింపు

- వైభవంగా శివాలయ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు
- వేద పండితుల ఆధ్వర్యంలో హోమాలు, ప్రత్యేక పూజలు

**జయభేరి, పరకాల, నవంబర్ 7:**



పరకాల నియోజకవర్గంలోని ఆత్మకూర్ మండల కేంద్రంలో మహిమాన్వితమైన పంచకూట పార్వతీదేవి సమేత మహాదేవ స్వామి ఉన్న ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి వేద పండితులు శివ కిరణ్ శర్మ ఆధ్వర్యంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రవీందర్ శర్మ, శ్రావణ్ శర్మ, శరత్ శర్మ ఆలయంలో ప్రతిష్టించాల్సిన పార్వతీ మాత, గణపతి కుమారస్వామి నవగ్రహ విగ్రహాలను గ్రామంలోని పురవీధులలో భక్తజన సందోహం నడుమ ఊరేగించారు. ప్రత్యేక రథం ఏర్పాటు చేసి పూలతో అలంకరించి రథం పై విగ్రహాలను ఏర్పాటు చేసి విగ్రహాలను ఊరేగించారు. భక్తులు రథంకు హారతులు ఇచ్చారు. మహిళలు కోలాటాలు నృత్యాలు చేస్తూ భజనలు చేశారు. ఆలయంలో విగ్రహాలకు శయ్యాది వాసం నిర్వహించారు. భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

- పత్తి కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**జయభేరి, పరకాల, నవంబర్ 7:**

గురువారం పరకాల వ్యవసాయ మార్కెట్ నందు సిసిఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కనీసం మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయుటకు 8% తేమశాతం కలిగిన పత్తికి రూ.7521 కనీస మద్దతు ధర కల్పిస్తున్నామని తెలిపారు. కావున రైతులు తాము పండించిన పత్తిని 8% తేమ మించకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కనీసం మద్దతు ధర పొందాలని తెలిపారు. రైతులు దళారులకు పత్తిని విక్రయించకుండా సీసీఐ కొనుగోలు కేంద్రంలోని పత్తిని విక్రయించి, కనీసం మద్దతు ధర పొందాలని కోరారు. సిసిఐ అధికారులు తేమశాతం పేరుతో రైతులకు ఇబ్బందులు పెట్టకుండా కనీస మద్దతు ధర కల్పించాలని, రైతులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని, ఈ విషయంలో రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు.

# స్వాగతం బోర్డుపై ఉర్దూ భాషను వాడుకలో తేవాలి



**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రెండవ అధికార భాష ఉర్దూను వాడుకలో తీసుకురావాలని, దేవరకొండ మున్సిపల్ అధికారులు వివక్షత చూపరని పట్టణానికి చెందిన మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ ఆధ్వర్యంలో పలువురు మున్సిపల్ నూతన కమిషనర్ ఎస్. సుదర్శన్ కి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో పట్టణ శివారు ప్రాంతాలలో ఉప్పాగు వద్ద, ముదిగొండ రోడ్డు వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వాగతం బోర్డులో కేవలం తెలుగు, ఆంగ్లం అక్షరాలను ఉపయోగించి,ఉర్దూ భాష పై వివక్ష చూపారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో స్వాగతం బోర్డుపై తెలుగు,ఆంగ్లంతో పాటు ఉర్దూలో రాయబడి ఉందని , దేవరకొండ లో మాత్రం విస్మరించారని అన్నారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్వాగత తోరణం పై ఉర్దూ భాషను వాడుకలో తేవాలని కోరారు. తెలంగాణ రెండవ అధికార భాష ఉర్దూను అన్ని ప్రభుత్వ కార్యాలయాల బోర్డులపై తప్పకుండ ఉంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ ఆరిఫ్,మొహమ్మద్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు స్కిల్స్ ఉంటేనే ఉద్యోగాలు

**జయభేరి, హైదరాబాద్:**

సచివాలయంలో ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గానికి చెందిన విద్యార్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం విద్యార్థులతో మాట్లాడుతూ. అందరికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం. చదువుతో పాటు స్కిల్స్ ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయి. అని విద్యార్థులకు సీఎం సూచించారు.

# ఉచిత చేప పిల్లల పంపిణీ

■ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి కోసమే ఉచిత చేప పిల్లల పంపిణీ ఎమ్మెల్యే బాలునాయక్



**జయభేరి, కొండమల్లెపల్లి :**

కొండమల్లేపల్లి మండల పరిధిలోని పెండ్లిపాకాల చెరువు వద్ద మత్స్యకారుల ఆర్థిక అభివృద్దే లక్ష్యంగా జిల్లా మత్స్యశాఖ అధికారులు,ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై,చేప పిల్లలను పంపిణీ చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఎమ్మెల్యే ని మత్స్యశాఖ అధికారులు మరియు సొసైటీ డైరెక్టర్లు శాలువాతో సత్కరించారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చేప పిల్లల పెంపకం పై ప్రభుత్వం దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు.

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో చేప పిల్లలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చేపల ఉత్పత్తి గణనీయంగా పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని సూచించారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ, అందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కృషి చేస్తున్నారని, పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమంతో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతుందన్నారు. భారీ వర్షాల కారణంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ఆలస్యం అయ్యింది అన్నారు. ఆలస్యం అయిన కూడా చేపలు పెరిగి మత్స్యకారులకు ఉపయోగకరంగా ఉందని తెలిపారు. మీ అందరి ఆశీస్సులతో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, మీరందరూ ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండాలని మత్స్యకారులను కోరారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. అనంతరం సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమంలో అధికారులతో కలిసి పాల్గొని, కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకొని,ఇంటి యజమానికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, దొంతం అలివేలు సంజీవ రెడ్డి,మాజి ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీదర్ రెడ్డి,PACS చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు వేమన్ రెడ్డి, మాజీ జడ్పీటిసి సలహాదారుడు యుగంధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మేకల శ్రీనివాస్, మాజి వైస్ ఎంపీపీ కాశర్ల వేంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, కోరేట్ల మాజి సర్పంచ్ దొండేటి మల్లా రెడ్డి, పాప నాయక్, సొసైటీ డైరెక్టర్లు లక్ష్మి, శ్రీనివాస్, హన్మ నాయక్, హెమ్లు నాయక్, కేతావత్ రమేష్ నాయక్, గడ్డం వెంకటయ్య, యువ నాయకులు సుభాష్ నాయక్, జిల్లా అధికారి ఎం చరిత, అభివృద్ధి అధికారి మారయ్య తదితరులు పాల్గొన్నారు.



## కేటీఆర్ చుట్టూ బిగుసుకుంటున్న ఫార్ములా ఈ రేసు స్కాం

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 7:**

ఫార్ములా ఈకార్ రేసింగ్ వ్యవహారంలో భారీ స్కామ్ జరిగిందని అనుమానిస్తున్న కేసులో ఏసీబీ దూకుడుగా దర్యాప్తు చేస్తోంది. ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం కొరడా విసురుతోంది. రాష్ట్రంలో జరిగిన పలు స్కాములపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కొనుగోళ్ల అంశం, లిక్కర్ పాలసీ కేసు ఇలా పలు అంశాలపై గత ప్రభుత్వం అవినీతి ఆరోపణలు ఎదురుకుంటోంది. వీటిలో లిక్కర్ పాలసీ కేసులో మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత కొన్ని నెలల పాటు జైలుకు సైతం వెళ్లి వచ్చారు. విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో అవినీతి జరిగినట్టు ఆరోపణలు రావడంతో కేసీఆర్ ను విచారణకు ఆహ్వానించినప్పటికీ ఆయన వెళ్లలేదు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ జరుగుతుండగా గత ప్రభుత్వంలో పనిచేసి ఆరోపణలు ఎదురుకున్న అధికారి విదేశాల్లో ఉన్నారు. ఫార్ములా ఈరేసింగ్‌కు సంబంధించి రూ.55 కోట్లు విదేశీ సంస్థలకు అక్రమంగా చెల్లించినట్లు గుర్తించారు. మున్సిపల్ శాఖ వద్ద రికార్డుల ఆధారంగా విదేశీ సంస్థలు, ప్రతినిధులకు నోటీసులు ఇవ్వనున్నారు. ఫార్ములా ఈరేసింగ్ నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన గత ప్రభుత్వంలోని పెద్దలకు కూడా నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ఈ రేసు వ్యవహారం మొత్తం కేటీఆర్ కనుసన్నల్లో జరగడంతో ఆయనకే నోటీసులు ఇస్తారని అంటున్నారు. ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్‌లో చోటుచేసుకున్నఅక్రమాలపై విచారణకు అవినీతి నిరోధక శాఖకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ రేస్‌లో రూ.55 కోట్లు ఎలాంటి అనుమతులు లేకుండా తరలించారు. ఐఏఎస్‌లు సహా అప్పటి బీఆర్ఎస్ సర్కారు పెద్దల ప్రమేయం ఉండడంతో కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. నుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ప్రస్తుత ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిని పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపట్టేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏసీబీ వెంటనే విచారణ ప్రారంభించింది. కేసుతో సంబంధం ఉన్నవారందరికీ విడివిడిగా నోటీసులు ఇచ్చి, విచారించి స్టేట్‌మెంట్లు రికార్డు చేయనున్నారు. ఐఏఎస్‌లు మొదలు కీలక అధికారులు, నాటి ప్రజాప్రతినిధుల దాక వీరిలో ఉండే అవకాశం ఉంది. స్టేట్‌మెంట్ ఆధారంగా గత ప్రభుత్వంలోని కీలక నేతలకు నోటీసులు జారీ చేసి ప్రశ్నించే అవకాశం ఉంది. ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి అప్పటి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు ఆదేశిస్తేనే విదేశీ సంస్థలకు నిధులు విడుదల చేశామని ఇప్పటికే అధికారులు వెల్లడించారు. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారిగా పని చేసిన అర్వింద్ కుమార్ కేటీఆర్ నోటి మాట ద్వారా ఆదేశించడంతోనే నిధులు ఇచ్చామని అంటున్నారు. మున్సిపల్ శాఖ నుంచి నిధులు మాయమయ్యాయి. ఓ విదేశీ సంస్థకు వెళ్లాయి. ఆ విదేశీ సంస్థకు చెల్లించాల్సిన అవసరమే లేదు. చెల్లించేందుకు ఆర్థికశాఖ అనుమతి.. కేబినెట్ అనుమతి లేదు. పూర్తిగా ప్రజాధనం లెక్కల్లో లేకుండా పోయింది. ఇది పూర్తిగా నిధుల స్వాహా అనే అభిప్రాయం కల్పిస్తుంది. అందుకే ఏసీబీ కేసు నమోదు చేసింది. సీరియస్ నేరం కావడం పక్కాగా సాక్ష్యాలు ఉండటంతో విచారణకు పిలిచి అరెస్టులు చేసే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

## నన్ను ఆలోచనలో పడేసిన
# అద్భుత సందేశం..





**వ్యాసకర్త: ఆలేటి రమేష్**
**99487 98982**

అనుదినం అలసి సొలసి ఇంటికి తిరిగొస్తాను
... ఇప్పటికీ అర్థం కాదు... పనిచేయటానికి
బ్రతుకుతున్నానా..? లేక బ్రతకటానికి పని
చేస్తున్నానా అని....? బాల్యంలో అందరూ మరీ
మరీ అడగిన ప్రశ్న ... పెరిగి పెద్దయ్యాక ఏమౌ
తావని? ఆ సమాధానం ఇప్పుడు దొరికింది!
మళ్ళీ బాల్యం కావాలని...
మళ్ళీ పిల్లాడిగా మారిపోవాలని
మిత్రుల నుంచి దూరం వెళ్ళాక నిజం
తెలిసింది... వాళ్ళు మిత్రులు మాత్రమే కాదు,
నాకు జ్ఞానోదయం కలిగించిన దేవుళ్ళని
ఔను... లోకం లాజిక్కుని చూపింది వాళ్ళే మరి
జేబు నిండుగా ఉన్నపుడు.. ఈ దునియా
ఏమిటో తెలిపింది వాళ్ళే జేబు ఖాళీ అయిన
పుడు తన వాళ్లెవరో తెలిపిందీ వాళ్ళే డబ్బు
సంపాదించేటపుడు తెలిసింది..
నా విలాసాలన్నీ అమ్మా నాన్నల డబ్బుతోనే
సమకూరేవని.. నేను సంపాదించిందంతా
కనీస అవసరాలకే సరిపోతుందని..
నవ్వాలని అనిపించినా ... నవ్వలేని పరిస్థితి...
ఎలా ఉన్నావని ఎవరైనా అడిగినప్పుడు
ఓహ్ ! నాకేం బ్రహ్మాండంగా వున్నా!!
అని అనక తప్పనప్పుడు. ఏడవాలన్నా ఏడవలే
ని పరిస్థితి! వాడికేందిరా.. దర్జాగా బ్రతుకుతు
న్నాడని అన్నప్పుడు ఇది జీవిత నాటకం..
ఇక్కడ అందరూ నటులే... నటించక
తప్పదు.... అవార్డుల కోసం కాదు... బ్రతకటం
కోసం కాదు.. కాదు.... బాగా బ్రతుకుతున్నా
నని నమ్మించటం కోసం.. నాడు రాతి మనిషి
నిప్పురాజేయటానికి చాలా కష్టపడ్డాడట...
ఇప్పుడు నిప్పు రాజేయాల్సిన పనే లేదు ...
ఇక్కడ మనిషి మనిషిని చూస్తే భగ్గుమంటా
డు... సైంటిస్టులు పరిశోధనలెన్నో చేస్తున్నా
రట... బాహ్య లోకంలో జీవం ఉందా లేదా
అని.. మరి మానవ జీవితంలో సంతోషం
ఉందా లేదా అని మనిషి వెతకడమే లేదు !!!
ఓజోన్ పొర డ్యామేజ్ అయి భూతాపం పెరిగు
తుందని ఆందోళన ... ఒకరిపై ఒకరికి వుండే
ఈర్ష్యా, ద్వేషాల మంటల గురించి పట్టించు
కోరే... పెరుగుతుంది కాలుష్యం మాత్రమే
కాదు కర్కశత్వం కూడా మట్టిలో మొక్కలు
నాటాలి... మనసులో మానవత్వం నాటాలి..!
ఇదంతా గట్టిగ అరవాలి...అందరికి చెప్పాలి..!
మళ్ళీ ఒక్క క్షణం... నాకెందుకులే అని..
సమస్య నా ఒక్కడిదే కాదుగా అని... నా కష్టం
గురించి అందరూ మాట్లాడాలి. పక్కవాళ్ళ
కష్టం గురించి పట్టించుకునేంత తీరికెక్కడిది
నాకు... నా పని... నా ఇల్లు... నా... నా.. నా...
నాతోనే నలిగిపోతున్నా... ప్రక్కవాణ్ణి నిందిస్తూ
రోజు గడిపేస్తున్నా. చేయడానికి చాలా టైం
వుందని చావు దగ్గరకొచ్చేదాకా చోద్యం
చూస్తున్నా! చివరికి ఉసూరంటూ కాటిదాక
నలుగురి కాళ్ళతో నడిచిపోతున్నా కనుమరు
గౌతున్నా... ఎవరినో అడిగాను ...
అసలు నిద్రకు చావుకు తేడా ఏమిటి అని ?
ఎవరో మహానుభావుడు ఎంతో అందంగా
సెలవిచ్చాడు !!!
నిద్ర, సగం మృత్యువట!
మరి మృత్యువు,ఆఖరి నిద్రట!!
అసలు ప్రశాంతంగా నిద్రించి ఎన్నేళ్ళయ్యిం
దో! ఏదో ఒకనిద్ర ఆవహిస్తే అదే వరం!
ఆనందం లేని అందం... జవాబు లేని
జీవితం.... ప్లాస్టిక్ పరిమళం..
సెల్ ఫోను సోయగం... వెరసి ఇదీ నా నాగరిక
జీవనం! తెల్లారి పోతున్నది...
రోజుమారుతున్నది..
మన జీవన యాత్ర అలాగే గడచి పోతున్నది....
ఏంటో జీవితం....
రైలు బండి లా తయారయింది!
ప్రయాణమైతే ప్రతి దినం చెయ్యాలి
చేరే గమ్యం మాత్రం లేనే లేదు!
ఒకడు శాసించి ఆనందిస్తాడు!
మరొకడు ఆనందాన్ని శాసిస్తాడు!
ఒక రూపాయి విలువ తక్కువే కానీ, అదే ఒక
రూపాయిని లక్ష నుండి విడదీస్తే....
అది లక్ష ఎప్పటికీ కాదు...
ఆ లక్ష సంపూర్ణం కాదు...
అందుకే... ఓ మనిషి మనీ కోసం కాకుండా,
ఆనందం,సంతోషం కోసం బతకండి..మహ
ర్షిలా బతకండి.. అదే నిజమైన జీవితమౌతుం
ది!! ఆనందాల హరివిల్లు అవుతుంది!!

# పలు హోటళ్లలో తనిఖీలు.. నోటీసుల జారీ

**జయభేరి, హైదరాబాద్:**




గ్రేటర్ హైదరాబాద్ లోని హోటల్స్, రెస్టారెంట్స్ పై జీహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారుల నాన్ స్టాప్ దాడులు నిర్వహించారు. మూసాపేట్ కృతుంగ రెస్టారెంట్ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు చేసారు. కిచెన్ లో ఎలుకలు, బొద్దింకలు ఉన్నట్లు గుర్తించారు. కిచెన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని నిర్ధారించారు. కుళ్లిన చికెన్ ను కృతుంగ హోటల్ నిర్వాహకులు. రోజుల తరబడి ఫ్రిజ్ లో నిల్వ ఉంచారు.ష మరోవైపు, ఓల్డ్ సిటీ సంతోష్‌నగర్ లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. శ్రీ రాఘవేంద్ర, ఉడిపి, సంతోష్ డాబా రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ దాడులు జరిపారు. హోటల్స్ కిచెన్ లో బొద్దింకలు గుర్తించారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు గుర్తించారు. కుళ్లిపోయిన కూరగాయలతో వంట చేస్తున్నారు. ఫంగస్ వచ్చిన అల్లం ను స్టోర్ రూమ్ లో గుర్తించారు. ఆహార పదార్థాల్లో మోతాదుకు మించి ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నారు. కిచెన్ లో అపరిశుభ్రమైన వాతావరణం వుంది. దాంతో హోటల్స్, రెస్టారెంట్ల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. ఆహార భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించకపోతే క్రిమినల్ కేసులు పెడతామంటూ హెచ్చరించారు.






## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ

■ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**జయభేరి, కొండమల్లెపల్లి :**

కొండమల్లేపల్లి మండల పరిధిలోని పెండ్లీపాకల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, వరి ధాన్యం సేకరణ రికార్డును పరిశీలించి,రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని అధికారులను ఆదేశించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. అన్నదాతలు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, PACS చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీదర్ రెడ్డి,మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఉట్కూరి వేమన్ రెడ్డి, జడ్పీటిసి సలహాదారుడు యుగంధర్ రెడ్డి,యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ,మాజి ఎంపీపీ బిక్కు నాయక్,మాజి సర్పంచులు పాప నాయక్, దొండేటి మల్లా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటయ్య,యువ నాయకులు సుభాష్ నాయక్, కేతావత్ నాయక్, హేమ్లా నాయక్, AEO, DTCS హన్మంతు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో రైతులను నిండా ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం



**జయభేరి, చింతపల్లి :**

తెలంగాణలో రైతులను నిండా ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం జనసేన పార్టీ దేవరకొండ ఇంచార్జ్ బంజారా సినీ హీరో చందు నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీఐ అధికారులు తమను అన్యాయం చేస్తున్నారంటూ చింతపల్లి మండల కేంద్రంలో రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనకు జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు తెలపడంతో పాటు ఆ పార్టీ ఇన్చార్జి చందు నాయక్ రైతులతో కలిసి రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీడు భూముల్లో సైతం పెద్ద ఎత్తున పత్తి పండించిన విషయం రాష్ట్ర ప్రభుత్వం గుర్తించినప్పటికీ అధికారుల అలసత్వం మూలంగా రైతులు నిండా మునుగుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంలో తెలంగాణ ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేవరకొండ ప్రాంతంలోని అనేక మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొందని ప్రభుత్వం తక్షణ స్పందించి ఈ అంశంపై చర్యలు తీసుకోకపోతే జనసేన పార్టీ ఆధ్వర్యంలో దేవరకొండ నియోజకవర్గం వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

## ఏఐ హబ్ గా అమరావతి

**జయభేరి, విజయవాడ, నవంబర్ 7:**


రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు సీఎం చంద్రబాబు. ఒకవైపు పాలనను గాడిలో పెడుతూనే.. మరోవైపు అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా కొన్ని కీలక రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చి.. అభివృద్ధి బాటలు వేయాలన్నది చంద్రబాబు ప్లాన్. అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించారు.ఏపీ సీఎం చంద్రబాబు ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. వైవిధ్యంగా కూడా ఉంటాయి. ఏదైనా ముందుచూపుతో వ్యవహరిస్తారన్న మంచి పేరు ఆయనకు ఉంది. సైబరాబాద్ ఆలోచన ఆయనదే. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా.. ఈ విషయంలో మాత్రం మెజారిటీ ప్రజలు చంద్రబాబుకు జై కొడతారు. అయితే అనూహ్య పరిస్థితుల్లో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చింది. గత అనుభవాల దృష్ట్యా అభివృద్ధితోపాటు సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు,రాష్ట్రానికి ఆదాయం సమకూర్చుకోవడం పై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ గా మార్చే ప్రణాళికలను రూపొందించారు.ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ,డ్రోన్ తయారీ ,సెమీ కండక్టర్ పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తుల్లో ఏపీని అగ్రగామిగా నిలపాలన్నది చంద్రబాబు లక్ష్యంగా తెలుస్తోంది. భవిష్యత్తులో అన్ని రకాల సేవలు, లావాదేవీలు డ్రోన్ టెక్నాలజీ ద్వారా జరగనున్నాయి. మొన్న విజయవాడ వరదల్లో సైతం డ్రోన్లతోనే బాధితులకు ఆహారం అందించారు. అదే డ్రోన్లతోనే సాగులో అనేక రకాలైన సేవలు చేపడుతున్నారు. దాదాపు అన్ని రంగాల్లో ~~డ్రోన్ల ఎంట్రీ ఖాయంగా తెలుస్తోంది. అందుకే ఆ రంగంపై చంద్రబాబు దృష్టి~~ పెట్టినట్లు తెలుస్తోంది.మొన్న ఆ మధ్యన విజయవాడలో అంతర్జాతీయ డ్రోన్ల ప్రదర్శన నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రపంచ నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.సరికొత్త ఆవిష్కరణలు చేశారు. అయితే దీని వెనుక చంద్రబాబు ప్రత్యేక వ్యూహం ఉంది. అమరావతిని డ్రోన్ల హబ్ గా మార్చాలి అన్నది చంద్రబాబు ప్లాన్. దేశం యావత్తు అమరావతి వైపు చూసేలా.. భారీ డ్రోన్ల రూపకల్పనకు అమరావతిని చిరునామా చేయాలన్నది లక్ష్యం. అందుకే ఇక్కడ డ్రోన్ల ప్రదర్శన నిర్వహించారు. ప్రపంచ నలుమూలల నుంచి ప్రతినిధులను ఆహ్వానించి.. అమరావతి చర్చకు వచ్చేలా చేశారు. మరోవైపు డ్రోన్ ఉత్పత్తి కంపెనీలకు అనంతపురంలో డెస్టినేషన్ గా మార్చాలని చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఇప్పటికే శ్రీ సిటీలో పరిశ్రమలు భారీగా ఏర్పాటయ్యాయి. దానిని సెమీ కండక్టర్ హబ్ గా మార్చేందుకు చంద్రబాబు ఆలోచన చేస్తున్నారు.మరోవైపు సాగరనగరం విశాఖలో ఐటీ అభివృద్ధికి ప్లాన్ చేస్తున్నారు చంద్రబాబు. ఇప్పటికే నారా లోకేష్ అమెరికా వెళ్లారు. దిగ్గజ పారిశ్రామికవేత్తలను కలిశారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారు.విశాఖలో ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి అన్ని రకాల వసతులు ఉన్నాయి. అందుకు అక్కడ మరింత అభివృద్ధి చేసి.. ఐటీ రంగంలో విశాఖను దేశంలోనే అగ్రగామిగా నిలపాలని చంద్రబాబు భావిస్తున్నారు. మొత్తానికి అయితే మంచి ఆలోచనలతో ముందుకు సాగుతున్నారు బాబు. మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షలు జరిపారు. టెక్నాలజీ రంగంలో సంస్కరణలు తీసుకురానున్నట్లు తెలిపారు. అవి మంచి ఫలితాలు ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మూవీభేరి

## విజయ్ దేవరకొండతో రొమాన్స్

సోషల్ మీడియా, ఓటీటీలు వచ్చిన అనంతరం సినిమాలలోని పాటలే కాకుండా ప్రైవేట్ ఆల్బమ్స్, సాంగ్స్ మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటున్న విషయం తెలిసిందే. అలా సూపర్ హిట్ అయిన సాంగ్స్‌లో హీరియే కూడా ఒకటి. మలయాళం నటుడు దుల్కర్ సల్మాన్, జాస్లీన్ రాయల్ జంటగా నటించిన ఈ పాట యూట్యూబ్‌తో పాటు అన్ని మ్యూజిక్ యాప్స్‌లో ఛార్ట్ బస్టర్‌గా నిలిచింది. అయితే హీరియే పాటతో క్రేజ్ తెచ్చుకున్న జాస్లీన్ రాయల్ తాజాగా విజయ్ దేవరకొండతో కూడా ఒక ప్రైవేట్ ఆల్బమ్ చేయబోతున్నట్లు తెలుస్తుంది. రీసెంట్‌గా విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, జాస్లీన్ రాయల్ కలిసి దిగిన ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఫొటో బయటికి వచ్చాకనే విజయ్ ఒక ప్రైవేట్ ఆల్బమ్ చేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా.. దీనికి సంబంధించి అధికారిక అప్‌డేట్ కూడా త్వరలోనే రానున్నట్లు తెలుస్తుంది.





## ఉందిలే మంచి కాలం

కన్నడ భామ పూజాహెగ్డే కెరీర్ తొలినాళ్ల లోనే అగ్ర హీరోల చిత్రాల్లో అవకాశాలు దక్కించుకొని సత్తా చాటింది. ముఖ్యంగా తెలుగునాట యూత్‌లో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. అయితే గత కొన్నేళ్లుగా ఈ భామకు అదృష్టం ఏమాత్రం కలిసి రావడం లేదు. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లో ఆమె నటించిన చిత్రాలన్నీ డిజాస్టర్స్‌గా మిగిలాయి. దీంతో పూజాహెగ్డే కెరీర్ ఇక ముగిసినట్లే అని భావించారు. కానీ ఈ భామ అనూహ్యంగా పుంజుకుంది. తెలుగు, తమిళంలో భారీ అవకాశాలను దక్కించుకొని అందరినీ ఆశ్చర్యపరచింది. ప్రస్తుతం ఈ భామ చేతిలో ఐదు చిత్రాలున్నాయి. తమిళంలో సూర్య, విజయ్ 69 చిత్రాల్లో ఈ అమ్మడు కథానాయికగా ఖరారైంది. అలాగే బాలీవుడ్‌లో షాహిద్‌కపూర్ సరసన 'దేవ' చిత్రంలో నటించనుంది. ఇలా వరుస భారీ ఆఫర్లతో కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందే ప్రయత్నాలో ఉంది పూజాహెగ్డే. ఫెయిల్యూర్స్ వల్ల ఎప్పుడూ బాధపడలేదని, మంచి సమయం కోసం ఓపిగ్గా ఎదురుచూశానని, భవిష్యత్తులో అంతా మంచే జరుగుతుందనే నమ్మకం ఉందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ధీమా వ్యక్తం చేసింది పూజాహెగ్డే.



## షారుఖ్ ఖాన్‌కు బెదిరింపులు

50 లక్షలు ఇవ్వకపోతే చంపేస్తామని ఫోన్ కాల్

ముంబై, నవంబర్ 7: బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుఖ్ ఖాన్‌ను చంపేస్తామని గుర్తు తెలియని వ్యక్తి ఏకంగా పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి బెదిరించారు. గురువారం ముంబైలోని బాంద్రా పోలీస్ స్టేషన్‌కు ఓ వ్యక్తి ఫోన్ చేసి.. షారుఖ్ ఖాన్ తమకు రూ.50 లక్షలు ఇవ్వకపోతే ఆయనను చంపేస్తామని హెచ్చరించాడు.

బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తి ఫోన్ నెంబరు ఆధారంగా పోలీసులు కూపీ లాగగా ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు చెందిన ఫైజన్ ఖాన్ అనే అడ్వకేట్ పేరు మీద ఆ నెంబరు రిజిస్టరై ఉన్నట్టు గుర్తించారు. రాయ్‌పూర్‌కు వెళ్లి ఫైజన్ ఖాన్‌ను విచారించగా.. తన ఫోన్ కొన్ని రోజుల క్రితమే పోయిందని, బెదిరింపు కాల్‌తో తనకు సంబంధం లేదని చెప్పారు. తనను బెదిరింపు కేసులో ఇరికించేందుకు ఎవరో ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాగా, 1994లో విడుదలైన అంజామ్ సినిమాలో జింకలపై షారుఖ్ ఖాన్ డైలాగ్‌పై తాను ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆయన చెప్పారు.

## ఓటీటీలో దేవర సందడి.. ఎన్ని భాషల్లో స్ట్రీమింగ్ అవుతుందంటే..?



జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం దేవర. కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ మూవీ రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. దేవర పార్టు 1 సెప్టెంబర్ 27న థియేటర్లలో ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలై సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ చిత్రాన్ని థియేటర్లలో మిస్సయిన వారి కోసం ఓటీటీ స్ట్రీమింగ్ అప్‌డేట్ వచ్చేసింది. ముందుగా వచ్చిన వార్తల ప్రకారం నేడు (నవంబర్ 8న) దేవర ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చేసింది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగు, తమిళం, మలయాళం కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. హిందీ భాషలో కూడా త్వరలో అందుబాటులోకి రానున్నట్టు సమాచారం. థియేటర్లలో దుమ్ము దులిపేసిన దేవర మరి ఓటీటీలో ఎలాంటి స్పందన రాబట్టుకుంటునేది సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇంకేంటి మరి దేవర మేనియా చూసి ఎంజాయ్ చేయండి మరి. ఈ మూవీలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటించగా.. ప్రకాశ్ రాజ్, మలయాళ యాక్టర్ షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ, హిమజ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా నిర్మించారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com